31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం 18 జులై 2026 | పేజీలు : 8

## ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల పరిధిలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతి, నమోదు శాతాలపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని బి.ఎల్.ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐ ఆర్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపించి, వాటిని త్వరితగతిన బి.ఎల్.ఓలకు అందజేసేలా విస్తృత అవగాహన

2లో

## పంట మార్పిడి కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలి



- **ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను విస్తృతంగా చైతన్యపరచాలి.**
- **సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయల మినుము, పెసర, అనుము లాంటి సాగుకు కార్యాచరణ సిద్ధం చేయాలి.**
- **కలెక్టర్ బి.సత్యప్రసాద్**

చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 : సూపర్ ఎల్ నినో ప్రభావం, వర్షభావం, సాగునీటి కొరత పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో పంట మార్పిడి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో వేగవంతంగా అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ప్రస్తుత సాగు పరిస్థితులు, వర్షపాతం, సాగునీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు అవకాశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

2లో

### కేంద్ర ప్రభుత్వ నిధులతోనే

# తెలంగాణ అభివృద్ధి





- **గడువులోగా అమృత్ పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవు**
- **15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లిస్తే ఊరుకునేది లేదు**
- **పంచాయతీ అకౌంట్‌లోని జమ చేసేలా కేంద్రానికి లేఖ రాస్తా**
- **సహాయ మంత్రి బండి సంజయ్**

చురకలు ప్రతినిధి సిరిసిల్ల జూలై 17 : కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, గ్రామాల అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సిరిసిల్లలో పర్యటించారు. సిరిసిల్ల పట్టణంలో జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గీతే, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ, స్థానిక బీజేపీ నేతలతో కలిసి అమ్రుత్ 2 స్కీం కింద రూ.1.32 కోట్ల నిధులతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న కార్గిల్ యుద్ధ శకటాన్ని సందర్శించి, కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ కార్గిల్ చెరువు పునరుద్ధరణ చేసి మురుగునీరు రాకుండా సుందరీకారంగా తీర్చిదిద్ది జిల్లా ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువును సందర్శించేలా పర్యాటక

2లో

## సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనుల పరిశీలన

**-పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్, జూలై 17:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, పాలు అందించే లక్ష్యంతో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు ఇతరత్రా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగాప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులు ట్రస్ట్ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న మార్కెట్ యార్డుకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరగా, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, మార్కెట్ చైర్మన్ మరియు డైరెక్టర్లు, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భూముల రీ-సర్వే పనులు

# వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత**



**చురకలు ప్రతినిధి, కోరుట్ల, జూలై 17 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని గ్రామ సభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కథలాపూర్, కోరుట్ల మండలాల్లోని నాగమల్లప్ప కుంట, ధర్మా రం గ్రామాల్లో నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులు (గ్రామ సభలు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ రైతులు, ప్రజలకు రీ-సర్వే ప్రక్రియ, దాని ప్రాముఖ్యత, సర్వే నిర్వహణ విధానం, ప్రభుత్వ మార్గదర్శకాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత మాట్లాడుతూ సర్వే అండ్ బౌండ్రీ యాక్ట్ 1923 నిబంధనల ప్రకారం భూముల రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరుగుతుం దని, రైతులు తమ భూములకు సంబం ధించిన వివరాలు, సరిహద్దులు, రికార్డులను పరిశీలించి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామ సభల ద్వారా భూ యజమానుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రీ-సర్వేపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందని

2లో

## వేంపేట్ లో పారిశుద్ధ్య నిర్వహణ



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, జూలై 17 :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణ చర్యల్లో భాగంగా మెట్‌పల్లి మండల వేంపేట్ గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని డ్రైనేజీల పరిసరాలు,నిల్వ నీటి ప్రాంతాలు,బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి,నీరు నిల్వ ఉండకుండా తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, కార్యదర్శి రాజు,పల్లె దవాఖాన వైద్యులు డా' నాగార్జున,ఏఎన్ఎంలు,వార్డు సభ్యులు ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల వీఓ లీడర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భర్త హత్య కేసులో భార్యకు యావజ్జీవం

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలుకు జగిత్యాల ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన ప్రకారం 2022 నవంబర్ 11న కొడిమ్యాల గ్రామంలో బత్తుల శ్రీను ఇంట్లో నిద్రిస్తుండగా, అతని భార్య బత్తుల ప్రమీలకు ఉన్న అక్రమ సంబంధం కారణంగా వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో శ్రీను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో తేలింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. మొదట అప్పటి సీఐ బి. కోటేశ్వర్, అనంతరం సీఐ డి. రమణమూర్తి దర్యాప్తు పూర్తి చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పీపీ రామకృష్ణారావు కోర్టులో వాదనలు వినిపించగా, సాక్షులను విచారించిన జగిత్యాల ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి సి.రత్న పద్మావతి శుక్రవారం తీర్పు వెలువరిస్తూ నిందితురాలు బత్తుల ప్రమీలను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. ఈ కేసులో నిందితురాలికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, సీఐలు కోటేశ్వర్, రమణమూర్తి, సీఐ ఎస్.ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సీఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## వాల్మీకి ఆవాసంలో ఉచిత ఆరోగ్య శిబిరం




**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 17 :** సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగిత్యాల ధరూర్ క్యాంపు లోని వాల్మీకి ఆవాసంలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండేటి అర్జున్, చర్మవ్యాధుల నిపుణులు డా. ఎనగందుల నరేష్ ఆవాసం పూర్వ విద్యార్థి డా. నరేంద్ర (అనస్తీసియా ) దంత వైద్య నిపుణులు డా. బాశెట్టి హర్షవర్ధన్ ఆర్.ఎం.పి, పిఎంపీల సంఘం బాధ్యులు డాక్టర్ ధనుంజయ, డాక్టర్ గోపాల చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో విద్యార్థుల ఎత్తు బరువు కొలిచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, మంచి ఆహార అలవాట్లు, ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు వివరించారు. ఆవాస విద్యార్థుల కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేసిన వైద్యులకు ఆవాస నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి మదన్ మోహన్ రావు, సభ్యులు డాక్టర్ ధనుంజయ, అశోక్ రావు, ఆవాస ప్రముఖ మల్లేశం, సత్యనారాయణ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే...

**మొదటి పేజీ తరువాయి...** కేంద్రంగా తీర్చిదిద్దుతఅన్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు రాష్ట్రమంతా కాంటాక్ట్ ను పట్టుకొని, ఎక్కడా పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదని , ఇతర కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా సిండికేట్ లా మారి ఇబ్బందులు పెడుతున్నారని, ఇకపై అట్లా జరగకుండా చూస్తామని తెలిపారు. అమ్రుత్ స్కీంను గొప్ప ఆశయంతో ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారన్నారు. అమృత్ 1 మిషన్ కింద రూ.77 వేల 640 కోట్ల వ్యయం అంచనా వేస్తే కేంద్రం 35 వేల 990 కోట్లు కేటాయించింది. 2021 నాటికి అమృత్ 1 స్కీం పూర్తయ్యిందని , 2021 అక్టోబర్ లో అమృత్ 2 స్కీం పేరుతో 2 లక్షల 99 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తే, అందులో కేంద్రం తన వాటాగా 76 వేల 760 కోట్లు కేటాయించిందన్నారు. అమృత్ 1 కింద తెలంగాణకు 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించిందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమ్రుత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ఖర్చు చేసిందని, అయినా తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్దాలాడుతున్నరని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళు ్లగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదని, సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇయ్యలేదని ఎద్దేవా చేశారు. అమ్రుత్ స్కీం కింద కేంద్రం గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులిస్తే...వాటిని అభివృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులను డైవర్ట్ బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను ఆ లక్ష్యానికే ఉపయోగించాలని, ఆ నిధులను దారి మళ్లిస్తే ఊరుకునేది లేదని, ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి తాను లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తానన్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులకు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతున్న క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాస్యస్పద వ్యాఖ్యలు చేశారు. సిరిసిల్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఫుడ్ ఇన్స్పెక్టర్ పనితీరును మీడియా ప్రతినిధులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, మీడియా ప్రతినిధులకు ఫుడ్ ఇన్స్పెక్టర్ లీగల్ నోటీసులు పంపిస్తానని బెదిరిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో బండి సంజయ్ స్పందిస్తూ మీడియా ప్రతినిధులకు లీగల్ నోటీసులు కొత్తేమి కాదని, వచ్చే లీగల్ నోటీసులే వారికి అవార్డులు, రివార్డులని తెలిపారు. అలాగే ఫుడ్ ఇన్స్పెక్టర్ విషయంపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడతానన్నారు.

## పంట మార్పిడి కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** నీటి నిల్వలు కూడా పరిమితంగా ఉన్నందున సాగునీటి వినియోగంపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉండే వరి సాగు కంటే తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం అత్యవసరమని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులను వివరించి పంట మార్పిడిపై చైతన్యం కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు నష్టపోకుండా ముందస్తు నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ విస్తరణ అధికారులు నిరంతరం గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయలు, మినుము, పెసర, అనుము తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధంగా ఉన్న రైతుల వివరాలను గ్రామాల వారీగా సేకరించి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, సాంకేతిక సూచనలను రైతులకు వివరించాలని, ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో వరి సాగు చేయాలని ఇంకా నిర్ణయం తీసుకోని రైతులను వ్యక్తిగతంగా కలిసి ప్రస్తుత పరిస్థితులను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకునేలా మార్గనిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, డి.ఆర్.డి.వో రఘువరన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, జిల్లా హార్టికల్చర్ అధికారి లత, డిపివో మదన్ మోహన్, ఎంపిడివోలు, ఏవో లు, ఏఈవో లు, టీఏ లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**తెలిపారు. భూ వివాదాల నివారణకు, ఖచ్చితమైన భూ రికార్డుల నిర్వహణకు రీ-సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కథలాపూర్ మండలం మోడల్ పాఠశాలలోని తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, బోధన విధానాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్, కోరుట్ల తహసీల్దార్ లు రాజ్ మహ్మద్, కృష్ణ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలి

**మొదటి పేజీ తరువాయి...** కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్, రూరల్ మండల తహసీల్దార్ లు రామ్ మోహన్, హకీమ్, సూపర్వైజర్లు, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 17:** తెలంగాణ తొలి మలి ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని, బాధిత, ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేయాలని హుజురాబాద్ టి జాక్ కన్వీనర్ ఆవునూరి సమ్మయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాదులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేశవరావు కమిటీ కరీంనగర్ తో పాటు మంచిర్యాల ప్రాంత ఉద్యమకారులతో హైదరాబాద్ సెక్రటేరియట్ అమర జ్యోతి ఆడిటోరియంలో గురువారం సమావేశమైందని, ఇందులో భాగంగా తమ కూడా హాజరై పలు విజ్ఞప్తులు చేసినట్టు తెలిపారు. ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలని, ప్రభుత్వ గిజిత్ ద్వారా తెలంగాణ సాధన సమర యోధులుగా ప్రభుత్వ గెజిట్ ద్వారా ప్రకటించాలని అన్నారు. చాలామంది తొలి మళ్లీ దశ ఉద్యమకారులకు ఇప్పటివరకు ప్రభుత్వ సహాయం అందలేదని వెంటనే అందించాలని కోరారు. తొలి మలి ఉద్యమాల్లో జైలు జీవితాన్ని గడిపిన వారిని పోలీసు జైళ్ల శాఖ ద్వారా మాత్రమే ధ్రువీకరించి ప్రభుత్వ సహాయాన్ని అందించాలని అన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి సారించాలి

**-గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు**
**-మండల వ్యవసాయశాఖ అధికారి ఆకు రాజ్ కుమార్**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (17) :** ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి సారించాలని జగిత్యాల ఇబ్రహింపట్నం మండల వ్యవసాయ శాఖ అధికారి అకు రాజ్ కుమార్ అన్నారు.మండలంలోని డబ్బ, వేములకుర్తి,ఫకిర్ కోండాపూర్, అమ్మకపేట్ గ్రామలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈసందర్భం గా వ్యవసాయ శాఖ అదికారులు రాజ్ కుమార్, రవళి, సాగర్,వినోద్ లు మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయ పంటలు,ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులుగా కంది,పెసర,మినుము, జొన్న, సజ్జ వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగుచేయాలని సూచించారు .స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా జీవామృతం,ఘన జీవామృతం,బీజామృతం వంటి సేంద్రియ పద్ధతులను అవలంబించి నేల సారాన్ని పెంపొందించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు .ఈ కార్యక్రమాలలో గ్రామల సర్పంచ్ లు కాశిరెడ్డి భాస్కర్,తరి రామానుజం, తోట రమేష్, సహకారసంఘ చైర్మన్ అంకతి రాజన్న,మాజీ సర్పంచ్ గంగాధర్ రైతులు పాల్గొన్నారు.

# ద్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ సినిమాను ఆదరించాలి

**-వేములకుర్తిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**
**-సినిమా టిక్కెట్లు పంపిణీ కార్యక్రమం**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (17) :** ద్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ సినిమాను ఆదరించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం వేములకుర్తి గ్రామ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ద్యాన పిరమిడ్ మాసర్స్ కొబ్బజి లక్ష్మీ నర్సయ్య, గుమ్మల తిరుపతి అన్నారు.శుక్రవారం వేములకుర్తి గ్రామంలోని కళవేదిక లో బ్రహ్మర్షి పత్రీజీ సినిమా పోస్టర్ ను అవిష్కరణ చేసి అదివారం విడుదల అవుతున్న సినిమాను అదరించాలని, మన ప్రాతంలో మెట్ పల్లి సాయికృష్ణ తియెటర్ లో ఉదయం 8-గంటలకు షో ప్రారంభం అవుతుందని ప్రజలు విక్షించి ధ్యాన ప్రస్థాన మహర్షి సుభాష్ పత్రిజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించి విజయవంతం చేయాలని,ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ధ్యాన యొక్క గొప్పతనాన్ని పరిచయం చేసి,ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిన మహనీయుడు సుభాష్ పత్రిజీ జీవితం, సందేశం, సేవలను భావితరాలకు చేరవేసే ఈ సినిమా గొప్ప ప్రయత్నం.ఈ చిత్రాన్ని వీక్షించి, ప్రచారం చేసి,విజయవంతం చేయడం ద్వారా పత్రిజీ ఆశయాలకు మన వంతు సహకారం అందిద్దామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామనుజం, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య,మార్కెట్ డైరెక్టర్ గుమ్మల రమేష్,అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి,దేవలయకమిటి చైర్మన్ కోటగిరి అశోక్, గ్రామస్తులు పోతరాజు శివరాజం,గుజ్జె గంగాధర్,మాలేపు శ్రీనివాస్,కోటగిరి అశోక్,అరె రమేష్, దేశట్టి రవి, పుప్పాల రాజేష్, దోనికెన శ్రీనివాస్,మాట్ల రవితేజ,రాధరపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల మళ్లింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** గ్రామపంచాయతీ నిధుల్లో 15శాతాన్ని కరెంట్ బిల్లుల చెల్లింపుకు మళ్లించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల సర్పంచులు జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో గ్రామపంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అత్యవసర కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించాల్సిన అవసరం ఏర్పడిందని వినతిలో పేర్కొన్నారు. సర్పంచ్లు లేని కాలంలో పెండింగ్లో ఉన్న బిల్లులు, పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్లోనే ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులు కూడా ఇప్పటివరకు గ్రామపంచాయతీల ఖాతాలకు జవు కాలేదని వినతిలో పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కరెంట్ బిల్లుల చెల్లింపునకు నిధులను మళ్లించడం వల్ల గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని, అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని వినతిలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ,వర్షాకాల అత్యవసర అవసరాలను దృష్టిలో ఉంచుకొని కరెంట్ బిల్లుల చెల్లింపుకు సంబంధించిన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కట్ట రాజేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**చురకలు విలేకరి, మల్లాపూర్, జులై 17 :** పశుపోషకులు గొర్రెలకు, మేకలకు వానాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ వైద్యులు రామచంద్రుడు సూచించారు. శుక్రవారం మండలంలోని రాఘవపేట పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పీపీఆర్ వ్యాధి నివారన టీకాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్, డా. నరేష్ రెడ్డి, ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, నాయకులు బైరి రవి కుమార్, బైరి రాకేష్, బకన్న, బోరాన్న, వార్డు సభ్యులు నత్తి రాము, చిట్యాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేకు ప్రజలు సహకరించాలి

**-కోమటికోండాపూర్ గ్రామసభలో మెట్‌పల్లి ఆర్‌డీఓ నర్సింహారావు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (17) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ సర్వే కార్యక్రమానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఆర్‌డీఓ నర్సింహారావు అన్నారు.మండలంలోని కోమటికోండాపూర్ గ్రామం లో శుక్రవారం భు భారతి గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ భూముల హద్దులు, వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడానికి నిర్వహిస్తున్న ఈ సర్వేలో రైతులు, భూ యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు సహకరించాలన్నారు.భూ సర్వే ద్వారా భూ రికార్డులు పారదర్శకంగా ఉండటంతో పాటు భవిష్యత్తులో వివాదాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన సుచించారు.ఈకార్యక్రమంలో తహశీల్దార్ వరప్రసాద్, సర్పంచ్ కోప్పెల పద్మజ,ఉపసర్పంచ్ రెబ్బటి సాగర్, ఆర్ ఐ రెవంత్ రెడ్డి, సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్లను పరిశీలించిన ఆర్‌డీఓ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (17) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని ఎర్దండి, కోమటీకోండపుర్ గ్రామలలో ఉన్న గోదవరి నది పుష్కర ఘట్ లను మెట్‌పల్లి ఆర్‌డీఓ నరసింహారావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఘట్ ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యాలు, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించి, మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వరప్రసాద్, గంగమాత అలయకమిటీ చైర్మన్ నాచుపల్లి రాజ్ కుమార్, సర్పంచ్ లు కోప్పెల పధ్మజ,కల్లెడ గణేష్, ఉపసర్పంచ్ లు రెబ్బటి సాగర్, రాజరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన



**చురకలు విలేకరి, మల్లాపూర్, జులై 17 :** మండలంలోని రేగుంట గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మహిళ సంఘ సభ్యులకు భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రూ.10లక్షలు మంజూరు చేసిందని, మహిళలు ఆర్థికాభావృద్ధికి అవసరమైన సంఘ సమావేశాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గనవేని నందిని, మల్లేష్, కార్యదర్శి వినీత, కారోబార్ సుధాకర్, నాయకులు సురకంటి తిరుపతి, కళాశాని రాజన్న, కత్తి నరేష్, బస రాజారెడ్డి, వార్డు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కండ్ల పెల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17:** జగిత్యాల రూరల్ మండలం లోని కండ్ల పెల్లి మోడల్ స్కూల్‌ను జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శుక్రవారం సందర్శించి పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యా వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, బోధన విధానాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, చదువుపై అంకితభావంతో ముందుకు సాగి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమాదేవి, ఎంపివో రవిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దౌర్జన్యం చేస్తున్న కూతురుపై తల్లి ఫిర్యాదు



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 17 :** తన కూతురు దానవేణి అనిత, అల్లుడు కొమురయ్య పోషిస్తా మని నమ్మించి ఎకరం భూమి గిఫ్ట్ డీడ్ చేయించుకొని పోషించడం లేదని, అట్టి గిఫ్ట్ డీడ్ రద్దు చేయించి తన పేరిట పట్టా మార్పించాలని, కూతురు, అల్లుడు నుంచి ప్రతి నెలా రూ. 10 వేలు పోషణ, వైద్య ఖర్చుల కింద ఇప్పిస్తూ వారిపై తగు చర్యలు తీసుకోవాలని సారంగాపూర్ మండలం రంగపేట కు చెందిన గుండవేణి రాజవ్వ( 68)అనే వృద్ధురాలు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి,ఆయన సాయంతో జగిత్యాల డివిజన్ ఆర్డీవో పి. మధుసూదన్ కు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఆర్డీ వో వృద్ధులు సంరక్షణ చట్టం సెక్షన్ 23,24 ప్రకారం కూతురు, అల్లుడు పై కేసు నమోదు కు ఉత్తర్వులిచ్చారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఆ వృద్ధురాలు విలేకరులకు తన గోడు రోదిస్తూ వినిపించారు.తన భర్త గంగమల్లు మరణించక ముందు రేచపల్లి గ్రామానికి చెందిన కూతురు అనిత, అల్లుడు కొమురయ్య లు తమను పోషిస్తా మని నమ్మించి రంగ పేట గ్రామం లోని సర్వే నెంబర్. 173 ఆ లో 33 గుంటలు, సర్వే నెంబర్. 166/ఇ /1/2 లో 7 గుంటలు మొత్తం ఎకరం భూమిని గిఫ్ట్ డీడ్ చేయించు కొని పోషించిడం లేదని, అడిగితే కొట్టుతూ చంపుతామని బెదిరించడంతో భయపడి రంగపేటలో ఆర్థిక ఇబ్బందులతో మా పుట్టింటిలో జీవిస్తున్నానని,ఆ గిఫ్ట్ డీడ్ భూమిని ఇతరులకు అమ్ముదామని రూ.5 లక్షలు భయనాగా తీసుకున్నారని, అట్టి గిఫ్ట్ డీడ్ ఎకరం భూమిని రద్దు చేసి తన పేరిట పట్టా మార్పించాలని, నాపై దౌర్జన్యం చేస్తున్న కూతురు, అల్లుడు పై కేసు పెట్టి నాకు ప్రతి నెలా పోషణ, వైద్య ఖర్చులకోసం రూ.10వేలు ఇప్పించాలని,ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలకు సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్, వారి బృందం సాయంతో ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు,సీనియర్ న్యాయ వాది హరి అశోక్‌కుమార్, వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారులు పి.హన్మంత్ రెడ్డి, వెల్ముల ప్రకాష్ రావు,గౌరి శెట్టి విశ్వనాతం ఎం.డి. యాకూబ్, కరుణలు పాల్గొన్నారు.

## జగిత్యాల నుంచి

## తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు



**-నియోజకవర్గ ఇన్ ఛార్జి పవన్ రావు ఆధ్వర్యంలో తరలి వెళ్లిన సీనియర్ నాయకులు**

**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 17 :** జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు మాజీ సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి పునుగోటి పవన్ రావు నేతృత్వంలో వందలాది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయానికి తరలి వెళ్లారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నాయకుల కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు.జగిత్యాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపిచ్చారు.నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియామకం అయిన పవన్‌రావును అభినందించారు. తనకు ఇన్ ఛార్జిగా అవకాశం ఇచ్చిన పార్టీ చీఫ్ కవితను పవన్‌రావు ఘనంగా సత్కరించారు.

## వీధుల్లో తిరుగుతున్న 14 మందిని

## రెస్క్యూ చేసిన జగిత్యాల పోలీసులు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు,డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనలతో శుక్రవారం జగిత్యాల పట్టణ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై,బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతున్న 14 మందిని రెస్క్యూ చేశారు.వారిపై మెంటల్ హెల్త్కేర్ యాక్ట్-2017 నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి స్నానాలు చేయించి,కొత్త బట్టలు అందించారు.వైద్యుల సూచనల ఆధారంగా హైదరాబాద్లోని ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తరలించారు. అనంతరం పట్టణ సీఐ పి.కరుణాకర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వీధుల్లో సంచరిస్తున్న వ్యక్తులను నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన వైద్య సహాయం అందించడం పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు.

## భూ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



**చురకలు విలేకరి,మల్లాపూర్,జులై 17 :** భూ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ రాం చందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజలు రీ-సర్వే ప్రక్రియ, ప్రాముఖ్యత, సర్వే నిర్వహణ విధానం, ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. నిబంధనలకు అనుగుణంగా సరిహద్దులు రికార్డులను పరిశీలించి సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. భూ వివాదాల నివారణకు ఖచ్చితమైన భూ రికార్డుల నిర్వహణకే రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దప్పుల పద్మ, నర్సయ్య, ఆర్ఐ అశోక్, ఏఎంసి చైర్మన్ అంతడపుల పుష్పలత, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 17 :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ధర్మపురి కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా ఆర్థికంగా బలహీనులు, చట్ట ప్రకారం అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవల సంస్థను సంప్రదించి న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు. న్యాయం ప్రతి పౌరుడి హక్కు చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత అని జాజాల రమేష్ అన్నారు.

## ధర్మపురి అభివృద్ధికి నిరంతరం కృషి



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 17 :** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహాయ సహకారాలతో ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్ తెలిపారు. శుక్రవారం ధర్మపురి ఇప్పటికే పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను కొనసాగుతున్న పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ పరిశీలించారు. వివిధ వార్డుల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో సమీక్షించి, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని ఆమె తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నాణ్యతను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధర్మపురి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు.ఆమె వెంట కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్,లు సిబ్బంది తదితరులున్నారు.

# అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి

**-పొలాస లలితమాత ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు**
**-మహిళలతో మార్మోగిన లలితా నామాలు**



**జగిత్యాల ప్రతినిధి, జూలై 17 :** లలితమాత అమ్మవారితో పాటు వారాహి మాతను పూజిస్తే సకల శు భాలు కలుగుతాయని శ్రీ లలితమాత ఆలయ  ఆలయ ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప తెలిపారు.జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని ప్రసిద్ధ 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయంలో శుక్రవారం వారాహి నవరాత్రుల్లో భాగంగా సుహాసినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని 108 శ్రీచక్రాలకు కుంకుమార్చన చేశారు. సకల సౌభాగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని వేడుకున్నారు.ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం,మాణిద్వీప వర్ణన పారాయణం జరిగాయి.వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది .ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ ..."వారాహి అమ్మవారి నవరాత్రుల్లో మనం చేసే ఈ సామూహిక పూజల వల్ల అమ్మ కరుణ తప్పకుండా మన గ్రామంపై ఉంటుందని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలి. ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి. నవరాత్రుల్లో కొలువైన అమ్మ భక్తుల కోర్కెలను తీరుస్తుంది. పొలాసలోని 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయం చాలా శక్తివంతమైనదన్నారు .ఇక్కడ చేసే ప్రతి పూజకు విశేష ఫలితం ఉంటుందని, అందరూ భక్తితో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని" కోరారు. కార్యక్రమంలో పాంపట్టి రవీందర్, పాంపట్టి సులోచన,చెల్లం సత్తయ్య, ఎన్నశీ కిషన్ రెడ్డి, రమేష్ రెడ్డి,మహేందర్, మార కైలాసం, ఊటూరి కళ్యాణి, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

# రూ. 3 కోట్లతో బందంపల్లి మినీ ట్యాంక్ బండ్

**-తీగల వంతెన కూడా నిర్మిస్తాం**
**-పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం**
**-చెరువు కట్ట అభివృద్ధికి అదనంగా నిధులు తీసుకొస్తాం**
**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 17 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి వద్ద ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3 కోట్లతో నిర్మించబోయే మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు రూ. 3 కోట్ల నిధులతో బంధంపల్లి చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ పనులు పరిశీలించిన సమయంలో చెరువు కట్ట వద్ద మరింత సుందరంగా ఉండేందుకు తీగల వంతెన కూడా నిర్మాణం చేపడతామని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించడం జరిగిందని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ పనులను నాణ్యతగా చేపట్టాలని  నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని గుత్తేదారునికి సూచించడం జరిగిందని పెద్దపల్లి ప్రజలకు రానున్న రోజుల్లోనే మినీ ట్యాంక్ బండ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,నుగుల్లా మల్లయ్య,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మరియు స్థానిక కౌన్సిలర్,పురేళ్ళ శైలజా సుధాకర్,సంబంధిత ఇరిగేషన్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలి

**-ఉద్యమకారుల ఫోరం నాయకుల డిమాండ్**



**చురకలు ప్రతినిధి,మంథని,జూలై 17 :** తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఉపాధి, వైద్యం, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ మంథని నాయకులు డిమాండ్ చేశారు.శుక్ర వారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరుల జ్యోతి వద్ద కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమకారులతో సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ఉద్యమకారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కేకే, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. మంథనికి చెందిన ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కమిటీ ముందు హాజరై పలు సూచనలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్, 1000 కోట్ల రూపాయలతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల్లో 20% వాటా కల్పించాలని, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని, ఈ ప్రక్రియలో కాలయాపన చేయకుండా సత్వర న్యాయం చేయాలని కమిటీ ముందు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి ఎక్కేటి అనంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల గట్టయ్య, ఉద్యమకారులు దేవళ్ళ విజయ్ కుమార్, కంకణాల తిరుపతిరెడ్డి, మట్ట రాజయ్య, పంతకాని రవి, పోరెడ్డి వెంకటరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ పైలట్ ప్రాజెక్ట్‌పై ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్




**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 17 :** ఈరోజు నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ.జానకి షర్మిల జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు,పోలీసు అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సీసీటిఎన్ఎస్ -ఏఐ పైలెట్ ప్రాజెక్టు ద్వారా కేసుల దర్యాప్తు మరింత వేగవంతంగా,నాణ్యంగా జరిగేలా కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. దర్యాప్తు అధికారులకు అవసరమైన సమాచారం,చట్టపరమైన అంశాలు, కేసు విశ్లేషణ,డిజిటల్ ఆధారాల పరిశీలనలో ఈ వ్యవస్థఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా, సాంకేతిక ఆధారాలతో పూర్తి చేసి, కోర్టుల్లో బలమైన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా పెంచడమే ఈ పైలట్ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రతి దర్యాప్తు అధికారి సీసీటిఎన్ఎస్-ఏఐ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి,కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని ఆదేశించారు. అలాగే కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నాణ్యతతో కూడిన దర్యాప్తు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ.జానకి షర్మిలతో పాటు, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు కంపాస్‌లు పంపిణీ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 17 :** రామగిరి మండలం చందనాపూర్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లు మరియు, కంపాస్ బాక్సులు వేరువేరుగా పంపిణీ చేశారు.చింతకింది కృష్ణ రజిని  కూతురు శ్రీనిధి, మరియు దీటి శ్రీనివాస్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) సరిత కొడుకు రాహుల్ యొక్క పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాల చందనాపూర్ విద్యార్థులకు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ కంపాస్ బాక్స్ స్వీట్ ఈసందర్భంగా పంపిణీ చేయడం జరిగింది. దీనిలో భాగంగా రామగిరి మండల విద్యాధికారి కొమురయ్య మరియు చందనాపూర్ పీజీహెచ్ఎం లక్ష్మి మేడం మరియు చందనాపూర్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ రాచర్ల శ్రీనివాస్ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ప్రెసిడెంట్ కిషోర్ దీనిలో భాగంగా పెద్దలు చింతకింది విశ్వనాథం వారి సతీమణి విజయ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడం జరిగింది.జూల నవీన్ వారి మన పాఠశాల విద్యార్థుల పై అభిమానంతో వారి తమ్ముని జూల ప్రవీణ్  జ్ఞాపకార్థం విద్యార్థిని విద్యార్థులకు 80 తేట్లను విద్యార్థులకు అందించడం జరిగింది ఈ సేవాభావం కలిగి ఉండడం చాలా గొప్ప విషయం విద్యార్థులపై ప్రేమ, అనురాగం ప్రభుత్వ పాఠశాలపై ఉండడం చాలా హర్షించదగ్గ విషయం కావున జూల నవీన్ కి మా పాఠశాల బృందం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమురయ్య సార్ గారు ప్రాథమికపాఠశాల చందనాపూర్ ప్రధానోపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్‌లో ఘనంగా మహాలక్ష్మి బోనాలు



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 17 :** జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌గ్రేషియాను వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలి

## -బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 17 :** గల్ఫ్ మృతులకు ఎక్స్‌గ్రేషియాను వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలని బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ఆనంతారం గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు జలపతి విదేశాల్లో మృతిచెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. తమ ప్రాంతం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు.తాను పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రితో చర్చించి, విదేశాల్లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయించినట్లు తెలిపారు. అయితే, గత ఏడాది కాలంగా గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన సుమారు 200 మంది కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదని, చెక్కులు మంజూరైన వారికి కూడా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాల కొరత కారణంగా యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ఉపాధి కోసం వెళ్లి గల్ఫ్ లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని బాధిత కుటుంబాలకు విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో లచ్చన్న, రాజు, జలేందర్, రాంచంద్రం, మోహన్, బషీర్, శ్రీపాల్, సురేందర్, రాకేశ్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి-భూసర్వే విజయవంతం చేయాలి




**చురకలు విలేకరి మెట్‌పల్లి రూరల్, జూలై 17 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి-భూసర్వే అవగాహన కార్యక్రమం విజయవంతం చేయాలనీ సర్పంచ్ గూడూరు తిరుపతి అన్నారు.మండలంలోని వెల్లుల,మసాయిపేట్ భూ సర్వే విజయవంతంగా నిర్వహించగా రైతులు భూసర్వే కార్యక్రమానికి పూర్తిగా సహకరించి,తమ భూముల హద్దులను ఖచ్చితంగా చూపించాలని సర్పంచ్ తిరుపతి కోరారు.ఈ సర్వే ద్వారా భూ రికార్డులు పారదర్శకంగా రూపొందడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు చెక్ పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తసిల్దార్ నీత,ఎడి సర్వేయర్ కిషన్, ఆర్ఐ సంధ్య రాణి,సర్వేర్ గంగానర్సయ్య,ఉప సర్పంచ్ శేఖర్,కార్యదర్శి నారాయణ,జిపిఓ రాజేశం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పారుడు రోగ నివారణ ఉచిత టీకాల ప్రారంభం



**చురకలు విలేకరి మెట్‌పల్లి రూరల్,జులై 17 :** ఉచిత పిపిఆర్ టీకాల కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ జీవాలను రక్షించుకోవాలని ఇన్‌చార్జి పశువైద్యాధికారి డా. కొమ్మెర మనీషా పటేల్ సూచించారు. మండలం లోని చింతలపెట్ పశువైద్య,సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో గొర్రెలు, మేకలలో వచ్చే ప్రమాదకరమైన పిపిఆర్ (పారుడు రోగం) నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తొట్ల చిన్నయ్య తో కలిసి ప్రారంభించారు. గొర్రెలు, మేకలలో వచ్చే అత్యంత ప్రమాదకరమైన వైరల్ అంటువ్యాధి సంవత్సరం లోపు ఉన్న జీవాల్లో వ్యాధి తీవ్రత ఎక్కువ ఉంటుందని వ్యాధి సోకిన జంతువులకు పెంపకదారులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఉపసర్పంచ్ లింగారెడ్డి. పశువైద్య సిబ్బంది ఉన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ తో ప్రజల మద్దతు కూడగట్టాలని, టీఎస్సీపీఎస్ ఈయు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనజాగరణ బస్సు యాత్రకు మద్దతుగా స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాల్లో గోడ పత్రికను పిఆర్టియూ టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆవిష్కరించారు. టీఎస్సిపిఎస్ ఈయు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ చేపట్టిన బస్సు యాత్ర తెలంగాణలోని అన్ని జిల్లాల గుండా జరుగుతుందని, జగిత్యాల జిల్లాలో ఈనెల 25, 26 తేదీలలో జన జాగరణ బస్సు యాత్రకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయ ఉద్యోగులు హాజరై మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సిపిఎస్ ఈ యు నాయకులు గంగాధరి మహేష్, మహేష్ గౌడ్, భోగ శ్రీనివాస్, పి ఆర్ టి యు టి ఎస్ నాయకులు ఏవియన్ రాజు, వెంకటేశం, చంద్ర ప్రకాష్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వసంత, శ్రీదేవి, విద్యాదేవి, పద్మ, అనుజ, మాధవి, రమాదేవి, విజయ, అనిల్ రావ్, శ్రీధర్, వెంకటేశ్వరరావు, పరమేశ్వర్, సునీల్, రాజ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందికి నియామకపత్రాల అందజేత



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 17 :** కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న అర్చక, డోలు, సన్నాయి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. ఈ పోస్టుల భర్తీ కోసం మే18న నిర్వహించిన అర్హత పరీక్ష ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈఓ) ఎస్. అంజనా రెడ్డి విడుదల చేశారు. 6 పోస్టులను భర్తీ చేయగా, వాటిలో 4 అర్చక పోస్టులు, 1 డోలు పోస్టు, 1 సన్నాయి పోస్టులు ఉన్నాయి. అర్చక పోస్టులకు తిరునహరి ఆకాష్ మనోజ, వకుళాభరణం అరుణ్ కుమార్, ఆశ్రిత్ తిరుక్కోవెల, తిరుక్కోవెల అజయ్ ప్రసాద్లు ఎంపిక కాగా,డోలు పోస్టుకు మంగలి సుదర్శన్ బాబు,సన్నాయి పోస్టుకు తిరుమల వెంకట అశోక్ ఎంపికయ్యారు.కాగా ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావు, ఐఏఎస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కొండగట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్.అంజనారెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

## వర్షాకాల సీజన్‌లో పరిశుభ్రత పాటించాలి




**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, జులై17 :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పరిసరాలను పరిశుభ్రగా ఉంచుకోవాలని సర్పంచ్ సుకెంట అరుణ అన్నారు.మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకై దోమల నివారణ చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి డ్రైనేజీల పరిసరాలు,నిల్వ నీటి ప్రాంతాలు, బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.చెత్త సేకరణ కోసం వేరే వేరు నూతన చెత్త డబ్బాలను పెట్టి ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి,నీరు నిల్వ ఉండకుండా తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



**చురకలు విలేకరి,మల్లాపూర్,జులై 17 :** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సీఈఎస్ఎస్ ప్రతినిధి మైస నరేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం, విద్యాభోదనపై తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించారు. పాఠశాలలోని గ్రంథాలయం, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు రికార్డులు పరిశీలించి సిబ్బందికి, ఉపాధ్యాయులకు పలు అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భూమేష్, సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గుండేటి రాజుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 17 :** జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థ కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజుకు కెఎంఎస్ ఐకాన్ అవార్డ్స్-2026లో భాగంగా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించినట్లు కెఎంఎస్ అధినేత మిలీనియం శ్రీనివాస్ శుక్రవారంనాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కళా, సాహిత్య రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి ఈ అవార్డును అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల జూలై 19 (ఆదివారం) కరీంనగర్‌లోని కళాభారతిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో గుండేటి రాజుకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా గుండేటి రాజుకు లభించిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, టి.వి. సూర్యం, కె.వి. నరేందర్, కవయిత్రులు అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు శ్రీలక్ష్మీ, వాణి, డా. చిందం సునీత, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ గుండేటి రాజుకు అభినందనలు తెలిపారు.

## ఆసియా అథ్లెటిక్స్ స్వర్ణ పతక విజేత

# ప్రవళికను అభినందించిన మంత్రి అడ్లూరి

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 17 :** చైనాలోని ఓర్డోస్‌లో నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4ఙ400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.స్వర్ణపథకం సాధించిన తెలంగాణకు చెందిన సాంఘీక సంక్షేమ గురుకుల క్రీడా ఆకాడమీ విద్యార్థిని నారి మళ్ళ ప్రవళికను రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సంక్షేమ శాఖ మంత్రి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ గురుకుల విద్యార్థిని దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయమని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా డిండి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక, సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ గా ఎదిగి దేశానికి స్వర్ణపథకం అందించడమే కాకుండా తెలంగాణ యువతలో అపారమైన ఆత్మవిశ్వా సాన్ని నింపిందని కొనియాడారు. ఆమె విజయం గ్రామీణ ప్రాంతాల



విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందనడానికి నిదర్శనమని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతుందన్నారు.ఆధునిక క్రీడావసతులు,నిపుణుల శిక్షణ, పోషకాహారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన శిక్షణా అవకాశాలను ప్రభుత్వం నిరంతరం విస్తరిస్తోందన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా గుర్తించి, ప్రతిభకు సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడాకారుల ను తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించే తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 స్థాయి ఉద్యోగం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం యువ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని మంత్రి తెలిపారు.ఈ చారిత్రాత్మక నిర్ణయం తెలంగాణలో క్రీడా సంస్కృతికి మరింత బలాన్ని చేకూర్చి, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో యువతను ముందుకు నడిపిస్తుందన్నారు. ప్రవళికను ఉన్నత స్థాయి క్రీడాకారి ణిగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన కోచ్ పస్పుల పరుశురాముడు డిండి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడా అకాడమీ శిక్షక బృందం, తల్లిదండ్రులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఒక క్రీడాకారుడి విజయానికి కుటుంబ సభ్యులు, కోచ్‌లు, శిక్షకుల అంకితభావం ఎంతో కీలకమన్నారు.

ప్రవళిక సాధిం చిన ఈస్వర్ణ పథకం తెలంగాణ గురుకుల విద్యార్థుల కు మాత్రమే కాకుండా రాష్ట్ర యువతకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుం దని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు, కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ వంటి అత్యున్నత వేదికలపైమరిన్ని పతకాలు సాధించి భారతదేశానికి, తెలంగాణకు కీర్తి తీసుకురావాలని నారిమల్ల ప్రవళికను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు.

### పోషకాహారం

# క్రమం తప్పకుండా ఇవ్వాలి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 17 :** అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులోని అంగన్వాడి కేంద్రంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని కోడిగుడ్లు, బాలామృతం, పిల్లల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. రోజూ ఎందరు పిల్లలు వస్తున్నారు? వారికి ఆట పాటల ద్వారా బోధన పై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోడిగుడ్లు, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. పిల్లలు ప్రతి రోజూ కేంద్రానికి వచ్చేలా చూడాలని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆటపాటల ద్వారా పిల్లలకు సులభంగా బోధన చేయాలని పేర్కొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థుల జిల్లా కోర్ట్ క్షేత్ర పర్యటన





**చురకలు ప్రతినిధి కరీంనగర్, జూలై 17:** విద్యార్థులకు క్షేత్ర పర్యటన ద్వారా విషయాల పట్ల విస్తృతమైన అవగాహన వస్తుందని మరియు పట్టు సాధించవచ్చని పాఠశాల నిర్వాహకులు 8,9 విద్యార్థులు అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టుకు బయలుదేరిన ముందు వారితో ముఖాముఖి ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో కోర్టులు ప్రజలకు న్యాయం అందజేయడానికి ఉంటాయని మరియు అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తుందని ప్రధానంగా సామాజిక న్యాయం పై దృష్టి పెరుగుతుందని వారు చెప్పారు. విద్యార్థులకు సామాజిక అవగాహనతో పాటు ప్రధానంగా వివిధ సామాజిక అంశాల పట్ల విస్తృతమైన అవగాహన కల్పిస్తుందని మరియు దానికి సంబంధించినటువంటి పలు విధివిధానాలను తెలియపరుస్తుందని వారు చెప్పారు.క్షేత్ర పర్యటనల ద్వారా విషయాలు చాలా సులభంగా అర్థమవుతాయని మరియు విద్యార్థులను చాలా లాభాలు చేకూరుతాయని చెప్పారు. ప్రధానంగా విషయాల పట్ల అనుభవం వస్తుందని అభిప్రాయప డ్డారు. నేడు ప్రపంచ న్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకొని విద్యార్థులను జిల్లా కోర్టుకు పంపడం జరిగిందని మరియు కోర్టులోని న్యాయవాదులను అందరిని పలకరించి ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని వారు చెప్పారు. ప్రధా నంగా ప్రతి ఒక్కరు న్యాయానికై పోరా డాలని మరియు అన్యాయాన్ని శిక్షించ బడాలని వారు అభిప్రాయపడ్డారు. ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ప్రపంచంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

### "సర్" క్షేత్రస్థాయి

# పరిశీలన చేయాలి




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 17:** ఓటర్ లిస్టుల పునః సమీక్షలో క్షేత్రస్థాయి పరిశీలన ముఖ్యమని, పార్టీ బూత్ ఇంచార్జీలు ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదును సూక్ష్మంగా పరిశీలించాలని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ "సర్" కోఆర్డినేటర్ల సమావేశం ప్రణవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. అన్ని పోలింగ్ బూతులలో ఓట్ల సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రతిరోజు సమీక్ష చేయాలని కోరారు. సర్ సరళిని పీసీసీ పరిశీలిస్తోందని, ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2002 ఓటర్ లిస్టు తో మ్యాపింగ్ చేయడం ముఖ్యమని, కొంతమంది ప్రదేశాలు మారారని, 2002లో వారున్న ప్రాంతాల్లోని ఓటర్ లిస్టులను వెతికి మ్యాపింగ్ చేయాలని కోరారు. 2002 తర్వాత జన్మించిన వారి ఓట్లను వారి తల్లిదండ్రులతో మ్యాపింగ్ చేస్తారని తెలిపారు. మ్యాపింగ్ విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని అన్నారు. ఒకే ప్రాంతాల్లో సుదీర్ఘకాలా నివసిస్తే సమస్య ఎదురు కాదని, కానీ ఉద్యోగాలు ఉపాధి నిమిత్తం వలస వెళ్లేవారు తమ ఓట్లు ప్రస్తుతం ఉన్నచోట నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ చూపాలని కోరారు. ఓటర్ల హనుమాన్లను నివృత్తి చేయాలని కోరారు. నిరక్షరాస్యులైన, వృద్ధ ఓటర్ల పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. నియోజవర్గ స్థాయి ఇంచార్జ్ లకు, బిఎల్ఓ, అధికారులకు సమాచారం అందించాలని, అందరినీ సమన్వయం చేస్తూ పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్ కోఆర్డినేటర్లు, భూత్ ఇన్చార్జీలు పాల్గొన్నారు.

# విశ్వకర్మల సామూహిక బంద్




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 17 :** పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, తీవ్రమైన కార్పొరేట్ కంపెనీల పోటీతో విశ్వకర్మల వృత్తి భారంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విశ్వకర్మ మనుమయ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. హుజురాబాద్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. రేట్లను పెంచుకునేందుకు ఈ నెల 18 (శనివారం) నుండి 20 (సోమవారం) వరకు మూడు రోజుల పాటు సామూహిక బంద్ నిర్వహిస్తామని వెల్లడించారు. సభ్యులంతా ఏకగ్రీవంగా తమ నిర్ణయానికి ఆమోదం తెలిపారని వివరించారు జూలై 18న ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ నిర్ణయించిన నూతన ధరల పట్టికను అమలు చేస్తామని, బంద్ చివరి రోజు జూలై 20 న శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సంఘం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలలన్నారు.